


# తానొకటి తలిస్తే...!?

"గుడ్‌లక్ ఎండ్ స్వీట్‌నైట్" విష్ చేశారు స్నేహితులు వెళ్ళిపోయేముందు. ఇంట్లో పెళ్ళికి వచ్చిన బంధువులు మాత్రమే వున్నారు.

ముత్తయిదువులు, నర్మదను గుమ్మం దగ్గరకు తీసుకువచ్చి, గదిలోకి తోసి, తలుపు గడియ పెట్టారు బయట. సిగ్గుపడలేదు నర్మద. హంసలాగ నడిచి వెళ్ళింది మంచంమీద కూర్చుని వున్న వీరేంద్ర దగ్గరకు.

"ఏం తీసుకుంటారు? పాలా? హార్లిక్సా?" అడిగింది మృదువుగా.

"థాంక్స్, హార్లిక్స్" హార్లిక్స్ తాగారు ఇద్దరూ. భుజంమీదనేయి వేసాడు వీరేంద్ర. చెయ్యి తోసెయ్యలేదు. చేతులు బిగించాడు.

"నాకు ఏదో మంచి ప్రజంటేషన్ ఇస్తానన్నారు. ఏదీ?" అడిగింది నర్మద.

"తర్వాత" మంచంమీదకు తోసాడు. రెండు చేతులతో మొహం కప్పుకుని కిలకిలా నవ్వింది నర్మద.

అరగంట గడిచింది. వీరేంద్ర మంచంమీదనుంచి లేచాడు మత్తుగా. నర్మద ఇప్పుడు కన్యకాదు. నర్మద కన్యాత్వం దోచుకున్నాడు, ప్రేమించి పెళ్ళి చేసుకున్న వీరేంద్ర.

"ప్రజెంటేషన్ కావాలా?" అడిగాడు వీరేంద్ర.

"కావాలి" అన్నది నర్మద గోముగా.

మంచం ప్రక్కన టేబిల్ మీద, భద్రంగా తెచ్చిపెట్టిన లేతగులాబీ రంగు సిల్కు సంచీ అందుకున్నాడు అతి జాగ్రత్తగా.

"ఏమిటా సంచిలో?" అడిగింది నర్మద కుతూహలంగా చూస్తూ.

"నీకే తెలుస్తుందిగా విప్పిచూడు" అన్నాడు.

సన్నటి మూతిగల ఆ సంచీ గులాబీరంగు పట్టు దారంతో కట్టి వుంది. లోపల బరువుగా, ఒత్తుగావుంది ఏదో.

నర్మద జారుముడి విప్పింది.

"కళ్ళు మూసుకో" అన్నాడు వీరేంద్ర నవ్వుతూ. కళ్ళు మూసుకుంది నర్మద.

"గుడ్‌గర్ల్. ఇప్పుడు లోపల చెయ్యి పెట్టిచూడు" సరిగ్గా చెయ్యి పట్టేంత వెడల్పుగల మూతి మాత్రమే వుంది ఆ సంచికి.

"అబ్బ ఏమిటిది? ఇంత మెత్తగా...."

రెప్ప వాల్చకుండా, వూపిరి బిగబట్టి చూస్తున్నాడు వీరేంద్ర దూరంగా జరిగి.

"అరె దీంట్లో ఏదో కదుల్తోంది...."

కెవ్వున అరచి, విదిలించి కొట్టింది సంచిలోని చెయ్యిని. సంచీ వెళ్ళి దూరంగా పడింది. కెవ్వున కేకలేస్తూ, చిందులు తొక్కుతోంది నర్మద.

సంచీలోంచి జరజర బయటికి పాకి వస్తున్న తాచుపాము పడగ మీద కోటు స్టాండ్ ఎత్తి మోదాడు సిద్ధంగా వున్న వీరేంద్ర. తల చితికి పోయింది.

పాముని చూడగానే షాక్‌వల్లనో, భయంవల్లనో, దానికాళ్లకిఎక్కిన

విషంవల్లనో కేకలు వేయడం ఆపేసింది నర్మద. ఒంట్లోకి విషం ఎక్కుతున్నకొద్దీ బాధతో మెలికలుతిరిగిపోసాగింది.

"వీరేంద్ర ప్లీజ్, నన్ను రక్షించు. కాటేసింది ఆ పాము" అన్నది నర్మద ప్రాణభయంతో కంపించిపోతూ.

"రెండు నిమిషాలు ఓపికపట్టు. అంతా అయిపోతుంది. దాని విషం వెంటనే పనిచేస్తుంది" చెప్పాడు వీరేంద్ర.

"వీరేంద్ర నేను చచ్చిపోవటం నీకిష్టమేనా? అందుకనే ఆసంచితో ఆ పాముని పెట్టి తెచ్చావా?" అడిగింది నర్మద దీనంగా.

"సారీ నువ్వు చచ్చిపోవటం నాకిష్టం వున్నా లేకపోయినా, నీ ఆస్తి అంటే నాకు ఇష్టం. నువ్వు మరణించేంత వరకు అది నాకు రాదని నీకు నామా వుందిగా" అన్నాడు వీరేంద్ర.

"అంతేనా? ఇన్నాళ్ళు నామీద చూపిన ప్రేమ కేవలం నటనేనా?" అన్నది నర్మద ఆశ్చర్యంగా

"ఫర్ గివ్ మి" చెప్పాడు వీరేంద్ర తలవంచుకొని.

విషం పూర్తిగా రక్తనాళాల్లోకి వ్యాపించడం వల్ల మైకం వచ్చినట్లుగా అయింది నర్మదకు. నరాలు, అవయవాలు కంట్రోల్ తప్పుతున్నాయి. కళ్ళుమూసుకు పోతున్నాయి.

"గుడ్ లక్ ఎండ్ స్వీట్ నైట్" అన్నాడు వీరేంద్ర. రెండు నిమిషాలు, కదలికలేకుండా కింద పడివున్న నర్మదవంక మౌనంగా చూస్తుండిపోయాడు.

వంగి, గులాబీరంగు సిల్కు సంచీ తీసి జేబులో పెట్టుకొన్నాడు. బయటకు కనపడకుండా, ఒకసారి చుట్టూ పరీక్షగా చూసి, వెళ్ళి తలుపులు తెరిచాడు.

"ఏమయింది?" నర్మద కేకలువిని బయట గుమిగూడి వున్నారు చాలామంది గుంపుగా.

"పాము! పాముకాటేసింది. నర్మదను డాక్టర్‌ని పిల్చుకురండి త్వరగా" అన్నాడు కంగారు నటిస్తూ.

"పామా? ఎక్కడనుంచి వచ్చింది?" అడిగారు ఆశ్చర్యంగా.

"ముందు డాక్టర్‌ని పిల్చుకురండి డామిట్. ఈ ఇంట్లో మీరే పాములు పెంచుతున్నారేమో?" అరిచాడు కోపంగా.

పదినిమిషాల తర్వాత డాక్టర్ వచ్చాడు మోకాళ్ళమీద కూర్చుని, చచ్చి పడివున్న పాముని పరీక్షగా చూసి "మైగాడ్" అన్నాడు. అందరూ వూపిరి బిగబట్టి చూస్తున్నారు.

"ఎంతసేపయింది కాటువేసి!" అడిగాడు డాక్టర్.

"పదినిముషాలు దాటింది" చెప్పాడు వీరేంద్ర.

"లాభంలేదు. వెరీసారీ. అంతాఅయిపోయింది. అన్నాడు డాక్టర్ పెదవి విరచి.

అందరూ అడిగే ప్రశ్నలనుంచి తప్పించుకునేందుకు, ప్రక్క గదిలోకి వెళ్ళి ఒంటరిగా తలుపులు బిడాయించుకున్నాడు వీరేంద్ర.

*                    *                    *

కారులోంచిదిగి ఆఫీసులోకి నడిచాడు వీరేంద్ర. తనని చూడగానే వినయంగా లేచి నుంచుని నమస్కారం పెట్టెవాళ్ళను చూసి నవ్వుకున్నాడు.

"డైరెక్టర్" అని రాసివున్న గదిలోకి నడిచాడు వీరేంద్ర. చల్లగా వుంది లోపల.

రివాల్వింగ్ చైర్‌లో కూర్చుని, టేబుల్‌మీద నీట్‌గా పేర్చిన కాగితాలు అందుకొని చూడసాగాడు. వీరేంద్ర భార్య నర్మద చనిపోగానే నర్మద పేరుమీద వున్న ఆ కంపెనీ షేర్లన్నీ, వారసుడైన వీరేంద్రకి చెందాయి. ఆ కంపెనీకి డైరెక్టర్ అయ్యాడు.

పావుగంట తర్వాత ఇంటర్ కమ్‌లో చెప్పింది. వీరేంద్ర సెక్రటరీ "మీకోసం పోలీస్ ఇన్‌స్పెక్టర్ వచ్చారు.

"దేనికి!" అడిగాడు విసుగ్గా.

"చెప్పటంలేదు. స్వయంగా మాట్లాడాలట మీతో" "పదినిముషాల తర్వాత తలుపుమీద వేళ్ళతో కొట్టిన చప్పుడయింది.

"కమిన్" అన్నాడు. మళ్ళీ చప్పుడు వినిపించింది. ఎర్కండిషన్డు గది కాబట్ట బయటికి వినిపించి వుండకపోవచ్చు వీరేంద్ర మాటలు.

తలుపు తీసుకొని లోపలికివచ్చాడు ఇన్‌స్పెక్టర్. "గుడ్‌మార్నింగ్" అన్నాడు తలుపు మూసి, టేబిల్ దగ్గరకు నడిచివచ్చి.

"గుడ్‌మార్నింగ్ కూర్చోండి" అన్నాడు వీరేంద్ర.

కూర్చుని, టోపీతీసి టేబిల్‌మీద పెట్టాడు.

"బిజీగా వున్నారనుకుంటాను" అడిగాడు ఇన్‌స్పెక్టర్ కాగితాల వంకచూసి, నవ్వుతూ.

"అవునే చాలా ముఖ్యమైన పనులు మిగిలిపోయాయి."

"నాకు రెండు నిముషాలు చాలు" చెప్పాడు ఇన్‌స్పెక్టర్.

"చెప్పండి"

"నర్మద అంటే మీ శ్రీమతి హత్య గురించి మాట్లాడదామని వచ్చాను" అన్నాడు వీరేంద్ర మొహంవంక పరిశీలనగా చూస్తూ.

"నర్మద హత్యా!"

"యస్"

"నర్మద హత్య ఏమిటి? మరణం అనండి" అన్నాడు కటువుగా.

"హత్యే అంటాను. కోల్డ్ బ్లడెడ్ మర్డర్" జవాబు చెప్పాడు ఇన్‌స్పెక్టర్ ఇంకా కటువుగా.

"యు ఆర్ మిస్టెకన్ ఎంటైర్లీ. ఆమె మరణం నేను స్వయంగా చూసాను" అన్నాడు వీరేంద్ర.

"అది హత్యఅని నిరూపించగలను."

"అది హత్య అని ఎవరు రిపోర్టు ఇచ్చారు మీకు?"

కొన్ని క్షణాలు మౌనంగా వుండిపోయాడు ఇన్‌స్పెక్టర్ ఆలోచిస్తూ. అకస్మాత్తుగా జేబులోంచి గులాబీరంగు దారం తీసి టేబిల్‌మీద పడేశాడు.

"ఈ దారంగురించి మీరు ఏమయినా చెప్పగలరా"అడిగారు.

గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి వీరేంద్రకి.

"తెలియదు"అన్నాడు వెంటనే.

అది హత్య అని నిరూపించగలను."

"ఎలా?"అడిగాడు వీరేంద్ర ఆతురతగా, భయంగా.

"ఒప్పుకుంటారా?"అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"ఏమిటి ఒప్పుకునేది? అడిగాడు వీరేంద్ర అమాయకంగా.

ఇన్‌స్పెక్టర్, వీరేంద్ర కళ్ళలోకి సూటిగా చూసాడు. "మీరాహంతకులని"

"డామిట్ మతిపోయిందా నీకు?"అరిచాడు వీరేంద్ర కోపంగా.

"అంతా రికార్డయింది"అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"యు ఆర్ వేస్టింగ్ మైటైమ్. రెండునిముషాలు అయిపోయింది" అన్నాడు వీరేంద్ర.

"అంతా రికార్డయింది టేపుమీద"

"ఏం రికార్డయింది టేపుమీద?"

"కోర్టులో విందురుగాని. నాతో స్టేషన్‌కి రండి. అరెస్టువారెంట్ నా జేబులో వుంది చూస్తారా?"

"అది హత్య అని మీకు ఎవరు రిపోర్టు యిచ్చారు? ఏం రికార్డయింది టేపుమీద?"అడిగాడు వీరేంద్ర.

"మీ గదిలో మంచంకింద టేపురికార్డర్ అమర్చారు. నర్మద స్నేహితురాళ్ళు. మీ దురదృష్టంకొద్దీ నర్మద శోభనంరోజు మీతో ఏం మాట్లాడుతుందో తెలుసుకొని తర్వాత ఏడిపించాలనే ఉద్దేశంతో మీరు

గదిలోకి రాబోయేముందు అమర్చారు. అందులో జరిగినదంతా రికార్డ యింది."

"గాడ్" అన్నాడు వీరేంద్ర.

"నర్మద క్లాస్‌మేట్సు రిపోర్టు టేపుతోసహా ఇచ్చారు."

"నేను ఆ టేపు వింటేనేకాని ఏమీ నమ్మను."

"కోర్టులో కేసులో వించుని వింటారులే"

"ఎంతకావాలి" అడిగాడు వీరేంద్ర.

"ఏమిటి?"

"ఆ టేప్ ఎంతకి అమ్ముతారు?"

"యు అర్ వేస్టింగ్ మై టైమ్"

"ఎన్నివేలు కావాలి కేసులోంచి తప్పించేందుకు?"

"వెళదాంపదండి" లంచం తీసుకోను.

"కనీసం నన్ను ఓ అయిదు నిముషాలు వంటరిగా వదలండి" అన్నాడు వీరేంద్ర తల పట్టుకొని.

నో! మీలాంటి ధనవంతులు ఇలాంటి సమయాల్లో ఆత్మహత్యా ప్రయత్నాలు చేస్తారు అవమానం భరించలేక. దయచేసి స్టేషన్‌కి నడ వండి" ఇన్‌స్పెక్టర్ లేచాడు.

వీరేంద్ర నీరసంగా లేచాడు.

"తానొకటి తలిస్తే, దేవుడు ఒకటి చేస్తాడు" అన్నాడు ఇన్ స్పెక్టర్.

(డిసెంబర్ 1971)